


# కల్తీకథ

రమణశ్రీ

సీతాపతికి హఠాత్తుగా ఓ పెద్ద కష్టం వచ్చి పడింది. ఆ కష్టం పగవాడికి కూడా రాకూడదనుకునేటంతటి కష్టం.

'తనూ బ్రహ్మాండంగా కథలు వ్రాయాలి. తనకూ రచయితగా పేరు ప్రతిష్టలు రావాలి. ఎలా ?' ఇదే ఆలోచన అతన్ని నెల రోజులుగా పట్టి పీడిస్తోంది.

దేశంలో కథలకు డిమాండ్ పెరిగిపోతోంది. రచయితలకు సినిమా నటులకన్నా గ్లామర్ పెరిగిపోతోంది. ఎంతోమంది అందమైన ఆడపిల్లలు కథలు చదివేసి రచయితల్ని ప్రేమించేస్తున్నారు. పెళ్ళాం, పిల్లలు వున్న రచయితలనే ప్రేమించేసి దాసోహమంటున్న యీ తరుణంలో తనబోటి బ్రహ్మచారి కథలు వ్రాయడం మొదలుపెడితే... మై గాడ్... కళ్ళముందు రాధ తళుక్కున మెరిసి మాయమైంది.

రచయితలకున్న విలువను కాస్త ఆలశ్యంగానైనా సీతాపతి గుర్తించడానికి కూడా ఓ చిన్న కథ వుంది.

ఇంచుమించుగా మూడు నెలల క్రితం బస్టాప్‌లో చూశాడు రెండు జడల రాధను. బాపూ బొమ్మలా బస్టాప్‌లో నిలబడిన రాధను తనివిదీరా చూశాడు మొదటి రోజున.

ఆ తరువాత ఆ అమ్మాయి తను చదివే కాలేజీలోనే చేరిందని తెలుసుకున్న రోజున ఆనందంతో తలమునకలైపోయాడు.

ఎలాగైతేనేం, మెల్లగా రాధతో పరిచయం సంపాదించుకున్నాడు. ఆ తరువాత అవసరమైనప్పుడల్లా చిరునవ్వులు చిందిస్తూ, వాగ్బాణాలు విసురుతూ, చణుకులు రువ్వుతూ రాధా కటాక్షం కోసం ఎదురుచూడసాగాడు.

అయితే కొద్ది రోజులలోనే రాధా కటాక్షం కోసం తనతోబాటు మరో వ్యక్తి కూడా తపస్సు చేస్తున్నాడని గ్రహించేశాడు సీతాపతి.

అతని పేరు శ్రీనివాస్.

ధనంలోనూ, చదువులోనూ, అందంలోనూ, సర్దాగా మాట్లాడటంలోనూ సీతాపతికన్నా తీసికట్టు శ్రీనివాస్. ఈ విషయాలన్నీ పరిశోధించి తెలుసుకున్న సీతాపతి అతన్ని పెద్దగా దృష్టిలో పెట్టుకోలేదు.

''అన్నట్టు శ్రీనివాస్ చాలా బాగా కథలు వ్రాస్తారండీ! నాకు మొన్నటివరకు తెలియనే తెలియదు, 'శ్రీను' పేరుతో కథలు వ్రాసేది ఈయనేనని! నిజంగా ఎంత బావుంటాయో! మీరెప్పుడైనా చదివారా ?'' తనతో మాటల సందర్భంలో అంటున్న రాధ వైపు విచిత్రంగా చూశాడు సీతాపతి.

రాధ కళ్ళలో అంతటి మెరుపును అతన్నెడూ చూడలేదు గూడా!

ఆ తరువాత ఎప్పుడు రాధను పలుకరించినా శ్రీనివాస్ కథల గురించి ప్రస్తావన లేకుండా సంభాషణ ముగిసేదికాదు.

ఆఫ్టరాల్ కథలవలన రాధకు తనకన్నా దగ్గరైపోతున్న శ్రీనివాస్‌ను చూస్తుంటే సీతాపతికి వేడి నూనెలో వేగుతున్నట్లనిపించేది.

దానికితోడు యీ మధ్య పండుగ కథలపోటీలో సెకండ్ ప్రయిజ్ సంపాదించాడు శ్రీనివాస్.

ఆ సంఘటనతో రాధ ముందు మరో అయిదడుగులు ఎదిగిపోయాడు శ్రీనివాస్.

ఈసారి రాధ ఉత్తినే వూరుకోకుండా శ్రీనివాస్‌కు పార్టీ అంటూ ఓ అభినందన సమావేశం ఏర్పాటు చేసింది. శ్రీనివాస్‌ను పూలదండలతో ముంచెత్తి ధారాళంగా పొగిడేసింది.

''నీకు రచయితలంటే చాలా యిష్టమనుకుంటాను'' ఉండబట్టలేక అడిగేశాడు సీతాపతి.

చిద్విలాసంగా నవ్వింది రాధ.

''అవును. తమ కల్పనాశక్తితో పాఠకుల హృదయాలలో ఎన్నెన్నో అనుభూతులను రేకెత్తించే రచయితలంటే, ముఖ్యంగా శ్రీనివాస్ అంటే చచ్చేంత యిష్టం'' నిక్కచ్చిగా చెప్పేసింది రాధ.

సీతాపతి పైకి నవ్వేసి లోపల ఏడ్చేశాడు.

అప్పటినుండీ ప్రయత్నాలు ప్రారంభించాడు సీతాపతి. తను కూడా కథలు వ్రాయాలి. పోటీలో మొదటి బహుమతి పొందాలి. బహుమతులు కాకపోయినా తను వ్రాసిన కథలు ఏదో ఒక పత్రికలో ప్రచురణ అయినా కావాలి.

అదే పట్టుదలతో కృషిచేశాడు సీతాపతి.

వారంరోజులు అహోరాత్రాలు కష్టపడి తను

చూసిన సినిమాలు, చదివిన నవలలు అన్నింటినీ తీరికగా జ్ఞాపకం చేసుకొని రాసిన వాక్యం వ్రాయకుండా ఓ కధ వ్రాసి పంపాడు. కానీ పాపమా కధ పట్టుమని పదిరోజులయినా పత్రికాఫీసులో నిద్ర చేయకుండా భద్రంగా సీతాపతిని చేరుకుంది.

సీతాపతికి కోపం తాటి ప్రమాణాన లేచింది.

"నాన్సెన్స్! ఈ పత్రికలవాళ్ళకు తలకాయ లేదు. లేకపోతే యింత కష్టపడి కధవ్రాసి పంపిస్తే తిరుగు టపాలో పంపించివేస్తారా? శ్రమ జీవులంటే పత్రికలవాళ్ళకు యింత అవహేళనా? ఏమి అహంకారం? వీళ్ళకే వున్నాయను కుంటున్నారేమో పత్రికలు! తలుచుకుంటే తనూ క్షణంలో పత్రికను ప్రారంభించవచ్చును. తను గనుక పత్రిక పెడితే ముందు త్రిప్పిపంపేది "శీనుగాడి కధలే!" సీతాపతి హృదయంలో కోపం సుళ్ళు తిరుగుతోంది.

కొద్దిసేపట్లో ఆవేశం తగ్గి ఆలోచనలో పడ్డాడు.

'ఛ! అయినా ఒక్క కధకే తనింత నిరాశ పడగూడదు! పత్రికలు ఎన్నివున్నాయి? ఇదొక్కటే కాదుగదా? రచయిత కావాలంటే ఎంత కష్టపడాలి? పత్రిక స్వంతదైతే ఫర్వాలేదుగానీ, మరొకరి ద్వారా ప్రచురితం కావాలంటే కనీసం ఆ పరిశీలించే వ్యక్తికైనా నచ్చాలికదా!' ఎడతెగని ఆలోచనలతో కొట్టుమిట్టాడుతున్న సీతాపతికి మెరుపులా ఓ ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన రాగానే హృదయభారం చాలా తగ్గిపోయినట్లు ఫీలయ్యాడు. నరాల్లోకి మాతనోత్సాహం దిగుమతి అయింది.

'ఆహా. ఎంత బ్రిల్లియంట్ ఆలోచన! భేష్, నీకూ బుర్రవుందిరా సీతాపతీ, కాదు కాదు కాబోయే రాధిపతీ' రాగయుక్తంగా తనను తాను అభినందించు కున్నాడు సీతాపతి.

ఆలశ్యం అమృతం విషమన్నట్లు వెంటనే చొక్కావేసుకొని బయలుదేరాడు.

సరాసరి పురాతన గ్రంధాలయంలోకి వెళ్ళాడు సీతాపతి. లయన్‌లావున్న లైబ్రేరియన్ని పట్టుకొని ఫలానా పత్రిక పాతకాపీలు కావాలని అడిగాడు.

అతనోసారి జూలులావున్న జుట్టును గమ్మత్తుగా కదిలేలా తలవూపి గర్జించాడు "ఎందుకని మీకు" అంటూ.

ఆ గర్జనకు లేడిలా వణికాడు సీతాపతి. తనెంతో సౌమ్యంగా అడిగినా ఆయనలా కరిచినట్లు ఎందుకు సమాధానం చెబుతున్నాడో అర్ధంకాక తల్లడిల్లి, తెప్పరిల్లి "రిఫరెన్స్ కోసం" అంటూ గొణిగాడు.

అప్పుడే ఆహారం తినుకోవడం పూర్తిచేసిన పులిలా త్రేన్చి ఓ రాక్‌వైపు చేయి చూపించాడు లైబ్రేరియన్.

బ్రతుకుజీవుడా అనుకుంటూ ఆ రాక్ వద్దకు పరుగుతీశాడు సీతాపతి.

చకచకా రాక్‌ను గాలించడం ప్రారంభించాడు. అరగంట తర్వాత సీతాపతి అన్వేషణ ఫలించింది. అయిదు సంవత్సరాల క్రిందటి ప్రత్యేక సంచికను తీసుకొని బయటపడ్డాడు సీతాపతి.

ఇంటికివచ్చి తాపీగా కూర్చొని ఆ ఫలానా



# కల్తీ కధ

పత్రికలో ప్రధమ బహుమతి పొందిన కధ చదవడం ప్రారంభించాడు.

ప్రముఖ రచయిత పరాత్పరరావు వ్రాసిన ఆ కధను నిదానంగా చదవడానికి అరగంట పట్టింది సీతాపతికి.

"అబ్బా! ఎంత బాగా రాశాడీ రచయిత!" కధ ఆసాంతం చదివి మెచ్చుకోకుండా వుండలేక పోయాడు సీతాపతి.

ఓ తెల్ల కాగితం తీసుకున్నాడు. తను చదివిన కధలోని సారాంశాన్ని క్లుప్తంగా కాగితంమీద కెక్కించాడు. అంతా పూర్తయిన తర్వాత ఒకసారి చూసుకున్నాడు. క్లుప్తంగా కధ ఇది...

'మధు లక్షాధికారి. గీత మధ్యతరగతి యువతి. ఓ సంఘటనతో మధుతో గీతకు పరిచయ మేర్పడుతుంది. గీత కష్టాలను గమనించి మధు ఆమెకు తమ ఫ్యాక్టరీలో ఉద్యోగం యిప్పిస్తాడు. వారిద్దరి పరిచయం ప్రణయంగా మారుతుంది. అయితే ప్రణయం పుష్పించి పరిణయంగా మారేలోపే ప్రళయం సంభవిస్తుంది. ఆఫీసులో గీతకు ఓ కార్మికునకు సంబంధమున్నదని పుకారు పుడుతుంది.

మధు గీతను అపార్ధం చేసుకుంటాడు. ప్రేమించి పుచ్చుకున్న తన హృదయాన్ని వాపసు యిచ్చేయమంటాడు. కారణ మడుగుతుంది గీత. నా హృదయం స్థానంలో నీ హృదయముంది. నీది నీకిచ్చేస్తే నేను బ్రతకలేనంటుంది. కారణం నీకు తెలియదా అని ప్రశ్నిస్తాడు మధు. నాకు తెలియదంటుంది గీత. అయితే వినమంటూ ఓ కార్మికునితో గీతకు సంబంధమున్న విషయాన్ని ఎత్తిచూపిస్తాడు. అంతా విని శివ శివా అంటూ చెవులు మూసుకుంటుంది గీత. ఆ కార్మికుడు ఎవరో కాదని, అతగాడు తన అన్న అని, చిన్నప్పుడే వ్యసనాలకు బానిసై యింట్లోనుండి పారిపోయాడని, ఇప్పుడిప్పుడే అతన్ని మంచి మార్గంలోకి తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నానని చెబుతుంది.

అంతా విని తాను అపార్ధం చేసుకున్నానని తనను క్షమించమని అడుగుతూ గీతను ఆలింగనం చేసుకుంటాడు మధు.'

కధా సారాంశం సీతాపతి హృదయాన్ని గట్టిగా ఆకట్టుకుంది.

'ఈ కధను కొంచెం మార్చి, జస్ట్ పాత్రలను ట్విస్ట్ చేస్తే ఎలా వుంటుంది?' ఆలోచించాడు సీతాపతి.

ఈ కధ ప్రచురించి అయిదు సంవత్సరాలవుతుంది. ప్రవాహంలా వచ్చిపడుతున్న కధలలో యీ కధ ఎవరికీ గుర్తుండదు. గుర్తున్నా తనకొచ్చిన ప్రమాదం లేదు. ఎందుకంటే తను పాత్రలను ట్విస్ట్ చేస్తున్నాడు కాబట్టి!

ఆ కధనే ట్విస్ట్ చేసి పంపించాలని నిర్ణయించుకొని నిశ్చింతగా నిదురపోయాడు సీతాపతి.

ఆ మర్నాడే ప్రయత్నాలు ప్రారంభించాడు. రెండు దస్తాల తెల్లకాగితాలు, నాలుగు పేకట్ల సిగరెట్లతో కధనుపూర్తిచేశాడు. పాత్రలు, స్వభావాలు మారుతాయి. కథా గమనమంతా ఒక్కటే. శైలి అమోఘంగా వుంది. శిల్పం బ్రహ్మాండంగా కుదిరింది.

మరోసారి కధ జాగ్రత్తగా చదువుకొని కవరులో పెట్టి అడ్రస్ జాగ్రత్తగా వ్రాసి రిజిష్టర్ పోస్ట్‌లో మరీ పంపాడు కధల పోటీకి.

సరిగ్గా నెల రోజుల తర్వాత సీతాపతికి టెలిగ్రాం వచ్చింది. వణుకుతున్న చేతులతో టెలిగ్రాం విప్పి చదివిన సీతాపతికి ఆనందంతో స్పృహ తప్పుతున్నట్లనిపించింది.

కధల పోటీలో సీతాపతి కధకు ప్రధమ బహుమతి వచ్చింది.

ఆ తరువాత పది రోజులకు జరిగిన సన్మాన సభలో తన మెడలో దండ వేసి తనకేసి ఆరాధనగా చూస్తున్న రాధకేసి చూస్తూ నిండుగా నవ్వాడు సీతాపతి.

*  *  *

సుబ్బలక్ష్మి ఆ రోజు పొందిన అవమానం అంతా యింతా కాదు.

'పదిమందిలో వనజ తనను అంత అవమానిస్తుందా? బోడి కధలు రాసేది తనేనా? అలాంటి కధలు ఎన్నైనా రాయొచ్చు తలుచుకుంటే!' కడుపు మండిపోతోంది.

అయినా తనేమన్నదని? 'ఆ కధలో ఏమిటి బొత్తిగా అలా వ్రాశావ్? ఆడది అలా ఎక్కడైనా ప్రవర్తిస్తుందా?' అని అడిగింది. వనజ రాసిన కధ చదివి అభిప్రాయం చెబుతూ.

'ఎందుకు ప్రవర్తించదు! ఏదైనా రచయిత కలంలో వుంది గమ్మత్తు! అయినా రచనల గురించి నీకేం తెలుసులే' అంటూ పదిమందిలో ఛీత్కారం చేసింది వనజ.

తను ఎలాగైనాసరే వనజకు బుద్ధి చెప్పాలి. ఇంతవరకు వనజ చాలా కధలు వ్రాసింది కానీ, ఏ కధకూ పోటీల్లో బహుమతి రాలేదు. ఈసారి పోటీలో తను ఏదో బహుమతి సంపాదించాలి. అప్పుడుగానీ తెలుస్తుంది వనజకు తనంటే ఏమిటో!

మొత్తంమీద కధ రాయాలని నిర్ణయించుకొని ఓ శుభ ముహూర్తం చూసుకొని కాగితాలు, కలం ఖరీదు చేసింది.

దాదాపు పదిరాత్రులు కూర్చుని పది దస్తాల తెల్లకాగితాలను నలుపు చేసింది సుబ్బలక్ష్మి. ఏమిటో ఒక్క కధా సరిగా కుదరడంలేదు. తలా తోక వుండటంలేదు. కధా ప్రారంభం కొంచెం బాగా కుదిరితే, ముగింపు చెత్తగా వుంటోంది ఒకవేళ ముగింపు బ్రహ్మాండమైన మలుపు వచ్చినా ఎలా ప్రారంభించాలో అర్ధం కావడంలేదు. అయినా పట్టువదలని 'విక్రమార్కుడి'లా మరో పది దస్తాల కాగితాలు ఖరాబు చేసింది. కానీ ఏ ఒక్కటీ సంతృప్తిగా ముగియడంలేదు.

నిరాశగా కాగితాలను కట్టగట్టేసి ఆలోచిస్తున్న సుబ్బలక్ష్మికి తారాజువ్వలాంటి ఆలోచన వచ్చింది.

ఆలోచన వచ్చిన మరుక్షణంలోనే తనను తాను అభినందించుకొని ఆచరణకు పూనుకుంది.

వెంటనే అటకమీద వున్న వారపత్రికల కట్టల్ని క్రిందకు దించింది. తీరికగా పుస్తకాలను వెదకడం ప్రారంభించింది.

సుబ్బలక్ష్మి తాను కొన్న ఏ పత్రికనైనా

వ్రాయడం అలవాటు చేసుకుంది మూడేళ్ళనుండి. అది నేడు ఉపయోగపడింది.

సరిగ్గా మూడేళ్ళ క్రిందటి పండుగ ప్రత్యేక సంచికను చూస్తున్న సుబ్బలక్ష్మి కళ్ళు ప్రథమ బహుమతి పొందిన కథవైపు చూసి ఒక్కసారి ఆగిపోయాయి. గబగబా కథ చదివింది. అద్భుతంగా వుంది. రచయిత పేరు చూసింది. సీతాపతి !

వెంటనే తెల్లకాగితం తీసుకొని తను చదివిన సీతాపతి కథలోని సారాంశాన్ని వ్రాసుకుంది.

'గీత లక్షాధికారి ఏకైక పుత్రిక. మధు నిరుద్యోగ పేద యువకుడు. ఓ సంఘటనలో గీత కెంతో సహాయంచేసి గీత అభిమానాన్ని చూరగొంటాడు మధు. తనకు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా మధుకు తన తండ్రి ఫ్యాక్టరీలో ఉద్యోగం యిప్పిస్తుంది గీత. మధు–గీతల పరిచయం ప్రణయంగా మారుతుంది. ఆ ప్రణయం పరిణయంగా మారేలోపు ప్రళయం సంభవిస్తుంది. మధుకు ఫ్యాక్టరీలో పనిచేసే మరో అమ్మాయితో సంబంధమున్నట్లు తెలుసుకుంటుంది గీత. కోపంతో మధును నానా మాటలంటుంది. తన హృదయాన్ని వాపస్ యిచ్చేయమంటుంది. ఆశ్చర్యపోయిన మధు తన ప్రేమను తిరస్కరించడానికి కారణమడుగుతాడు. గీత తనకు తెలిసిన విషయం చెబుతుంది. అంతావిన్న మధు గీత తొందరపాటుకు చింతిస్తాడు. 'తనకు పరిచయమైన ఆ యువతి మరెవ్వరో కాదని, తన తోబుట్టువని, కుటుంబం – జరగని పరిస్థితిలో ఫ్యాక్టరీ కొచ్చి పురుషులతోబాటు పనిచేస్తున్నదని, ఆమెతో మాట్లాడటం చూసి అపార్థం చేసుకున్నావని చెబుతాడు. విషయం గ్రహించిన గీత తన అల్పత్వానికి సిగ్గుపడి మధు నిండుమనసును అర్థిస్తుంది !

సీతాపతి విరచితమైన ఆ కథ సుబ్బలక్ష్మిని విశేషంగా ఆకర్షించింది.

'తను యీ కథను స్వల్పంగా మార్పులు చేసి మరో పత్రికకు పంపిస్తే సరి. ప్రవాహంలా వచ్చి పడుతున్న నేటి కథలలో యీ చిన్న నీటి బిందువును ఎవరు గుర్తిస్తారు ? ఇలా చేయడం తప్పు కావచ్చును. కానీ తప్పదు !' దృఢంగా నిర్ణయించుకొని కార్యాచరణకు పూనుకుంది.

వారం రోజులలో కథ పూర్తయిపోయింది. తృప్తిగా ఓసారి చదివి చూసుకొని పండుగ కథల పోటీకి పంపించింది.

కథ పంపిన తర్వాత నిమిషాలు, గంటలు లెక్కబెట్టడం ప్రారంభించింది రిజల్టు కోసం. దాదాపు నెల రోజులకు తన కథకు ద్వితీయ బహుమతి వచ్చిందని తెలియపర్చుటకు సంతోషిస్తున్నామంటూ వచ్చిన టెలిగ్రామ్‌ను చూడగానే ఆనందంతో నోట మాట రాలేదు సుబ్బలక్ష్మికి.

ఆ మరుసటి రోజు పదిమంది ఆడవాళ్ళముందు వనజ వ్రాసిన కథలను విమర్శిస్తూ ఘాటుగా దులిపేసింది సుబ్బలక్ష్మి.

* * *

పండుగ ప్రత్యేక సంచిక వచ్చిన పది రోజులకు పోస్ట్‌లో వచ్చిన (సదరు పత్రికవారు రీడైరెక్టు చేసినవి) ఉత్తరాలను ఉత్సాహంగా పరిశీలిస్తున్న సుబ్బలక్ష్మిని ఓ ఉత్తరం ఆశ్చర్యంలో ముంచెత్తింది. తిరిగి ఆ వుత్తరాన్ని చదివింది.

కుమారి లేదా శ్రీమతి సుబ్బలక్ష్మిగార్కి –

అమ్మా,

ఈ వారం ప్రత్యేక సంచికలో తమచే విరచితమైన కథ చదివాను. అమోఘంగా వుంది. నాకెంతో ఆనందం కూడా కలిగింది. ఎందుకంటే దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం యిదే నా కథ ఫలానా పత్రికలో ప్రచురింపబడింది. సదరు పత్రిక తాలూకు నావద్ద దాచుకున్న కాపీ నా భార్యామణి తప్పిదం వలన మరికొన్ని పుస్తకాలతో కలిసి నన్ను విడచి వెళ్ళిపోయింది (కూరగాయల కొస్తాయని చిత్తు కాగితాలవాడికి అమ్ముకోవడం వలన). ఆ కాపీకొరకు నేను కొంత ప్రయత్నంచేసి ఫలించక వూరుకున్నాను. తిరిగి మీ దయవలన నా కథను ఈ వారం పత్రికలో చూసుకోగల్గాను. పేరు ఎవరిదైతేనేమిలెండి, మళ్ళీ నా కథ అచ్చుపత్రికలో నాకు దొరికింది అందుకు మీకు ధన్యవాదాలు. మరో విన్నపం. నా కథ ప్రచురింపబడిన పత్రిక కాపీ మీ వద్ద వున్నదని యీ సంఘటన వలన రూఢీ అవుతున్నది. దయచేసి ఆ కాపీ నాకు పంపినయెడల (అందులోనైతే కథతోబాటు నా పేరుగూడా వుంటుందనే దుర్బుద్ధి సుమండి) మీకు తగిన పారితోషికం పంపగలవాడను.

కృతజ్ఞతలతో
పరాత్పరరావు.

ఉత్తరం మడిచి నొసలు చిట్లించి మరీ ఆలోచించింది సుబ్బలక్ష్మి. తను కాపీ గొట్టిన కథా రచయిత 'సీతాపతి' అయితే ఈ 'పరాత్పరరావు' ఎవరో ఎంత ఆలోచించినా అర్థంగాక అమృతాంజనం సీసాదగ్గరికి పరుగుతీసింది సుబ్బలక్ష్మి. ★

# లోకులకు కాకులు

లోకులు కాకులు – లోకులు కాకులు అని పలువుర్రు కేకలు పెడుతుంటే
ఆ కేకలు వినివిని కాకులు ఒకట్రై లోకులమీదకు ఒక లేఖను విసిరాయి.

లోకులకు కాకులు వ్రాయులేఖ :–

తాళి పెళ్లి కాదు మాది – ఎగతాళి బ్రతుకసలే కాదు
కడదాకా కలిసి బ్రతికే అనురాగపు దాంపత్యం మాది
తాళి కడతారు మీరు – ఆలుమగల మంటారు
కలిసి కడతేరలేక కొందరు విడాకులందుకుంటారు

మాలో గూడులేనివారు లేరు ఒకరి గూడు కోరుకోరు
మీలో ఎందరివి సొంత యిళ్లు ? మీ బ్రతుకే అద్దె కొంపలపాలు

గుడ్లుపెట్టి కలిసి పొదిగి పిల్లలకై పరితపిస్తాం
ఏరుకొచ్చిన తిండిపెట్టి మా పిల్లల్ని మేం పెంచుకుంటాం
మీలోన మాయగాళ్ళు కడుపుజేసి పారిపోతే
పసిగుడ్డును పారేసి కన్నతల్లి అదే దౌడు

రెక్కలొచ్చిన మా పిల్లలు మాపై ఆధారపడరు
పౌరుషంగా పదిమందిలో స్వతంత్రంగా బ్రతుకుతారు
మీసమొచ్చినా పెళ్ళమొచ్చినా మిమ్మొదలరు కొందరు పిల్లలు
కన్నందుకు తల్లిదండ్రులు పోషించడం లా అంటారు

మా కెవరికైనా యెక్కడైనా తిండి కనిపించిందంటే
అందర్నీ పిలుస్తాం అందరం కలిసి తింటాం
మీలో కొందరు పెద్దలు పాపం! ఉన్నది తామే మేసేద్దామని
తక్కినవారిని తోలేస్తారు అడ్డు తగిలితే పాతేస్తారు

మాలో ఒకరు చచ్చిపోతే అందరం చేరతాం
దూరమైపోయినందుకు భోరుమని యేడుస్తాం
పాటివాడి శవం రోడ్డు పక్కన కుళ్ళుతుంటే
ఎందుకొచ్చిన గొడవంటూ పక్కనుంచి పోతారు మీరు
పైపెచ్చు ఫోజుకొట్టి మానవ జన్మ మహత్తరమని
మానవుడే దేవుడని దెయ్యం కబుర్లు చెబుతుంటారు

అందుకే యికమీదట లోకులు కాకులు అనొద్దు
నీతిలేని మీతో మమ్మల్ని కలపొద్దు

ఇట్లు
పలు గాకులు

— టి. ఎస్. ఎస్. రంగనాథ్